
అంబులెన్స్ సిబ్బందే ఆదుకుంటున్నారు..! 2





ఇంటిపై కూలిన రైస్‌మిల్లు గోడ.. తండ్రి కూతురి మృతి 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in




## పోషకాహారంపై అవగాహన

**అక్షరటుడే, బాల్కొండ:** పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని సీడీపీవో భార్గవి పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా బాల్కొండ మండల కేంద్రంలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



## ఎస్సారెస్పీకి భారీ వరద..



**అక్షరటుడే, మెండోరా:** శ్రీ రాంసాగర్ ప్రాజెక్టుకు వరద భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టు 40 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి 1,52,225 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా.. అవుట్ ఫ్లో 3,01,321 అవుట్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1088.70 అడుగుల (72.23 టీఎంసీలు) మేర నీరు నిల్వ ఉంది. ఎస్సారెస్పీ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పాటు కాల్వలకు కూడా నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 400, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, అలీసాగర్ ద్వారా 180 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

## పీపీ దయాకర్‌గౌడ్‌కు సన్మానం




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ఎస్సీ, ఎస్టీ కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన దయాకర్ గౌడ్‌ను ఘనంగా మంగళవారం సన్మానించారు. మాలల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నీలగిరి రాజు ఆధ్వర్యంలో కోర్టులో దయాకర్‌గౌడ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బంటు వసంత్, న్యాయవాది గైక్వాడ్ వినయ్, మాలల ఐక్య వేదిక కోశాధికారి గైని మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## సూపరింటెండెంట్‌పై దాడికి నిరసనగా ఆందోళన

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** మెడికల్ కళాశాల ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌పై దాడికి నిరసగా నగరలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నల్ల రిబ్బన్లు ధరించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, వైద్యవిద్యార్థులు మాట్లాడుతూ.. మహబూబాబాద్ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌పై అమానుషంగా దాడిచేసిన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అపస్మారక స్థితిలో 60 శాతం కన్నా తక్కువ ఆక్సిజన్ శాతంతో వచ్చిన రోగి ఆస్పత్రిలో మరణిస్తే.. మరణానంతరం ఆ రోగి బంధువులు వైద్యులపై, మెడికల్ సూపరింటెండెంట్‌పై దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషల్ పోలీసు ప్రొటెక్షన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సి'పోల్స్'పై ఫోకస్!

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి చాలా మంది యత్నిస్తున్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకున్నా.. త్వరలోనే ఎన్నికలు జరుగుతాయని ఆశావహులు అనుకుంటున్నారు. దీంతో ప్రజలను తమ వైపు తిప్పుకోవడానికి యత్నిస్తున్నారు. తాము పోటీ చేయాలనుకునే వార్డులలో నిత్యం తిరుగుతున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తామున్నామనే భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

- వార్డులలో ప్రజల సమస్యలు తీరుస్తున్న ఆశావహులు
- అడిగినవన్ని కాదనకుండా ఇస్తున్న వైనం
- యువత నాడి పట్టుకునే ప్రయత్నంలో నిమగ్నం
- బెడిసికొట్టే ప్రమాదం ఉందంటున్న రాజకీయ విశ్లేషకులు

కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డులున్నాయి. ఆయా వార్డులలో మాజీ కౌన్సిలర్లు ఎంతో కొంత అభివృద్ధి చేసి చూపించారు. అయినా ఇంకా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో మరోసారి అవకాశం వస్తే అన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. మరోవైపు కొత్తగా కౌన్సిలర్‌గా తమ అదృష్టాన్ని పరిష్కరించుకునేందుకు అనేక మంది సేవా కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారు. తాము పోటీ చేయాలనుకునే వార్డులో ఏ చిన్న సమస్య ఉన్నా అభ్యర్థులు పరిష్కరించేందుకు పోటాపోటీగా వాలిపోతున్నారు.

### కాదనకుండా ముందుకు..

పట్టణ ప్రజలు సైతం ఇదే అదునుగా తమ పనులను చక్కబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. కాలనీలో చిన్న సమస్య ఉన్నా అభ్యర్థిని అడిగేస్తున్నారు. దాంతో ఏ పనైనా కాదనకుండా ముందుకు సాగుతున్నారు. శుభకార్యాల నుంచి మొదలు ఏదైనా అశుభం జరిగినా ముందుండి నడిపిస్తున్నారు. ఎంతోకొంత ఆర్థిక సహాయం అందజేస్తూ నమ్మకాన్ని పెంచుకుంటున్నారు. ఇలా పలువురు ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చు చేశారు.

### విగ్రహ దాతలుగా..

కామారెడ్డి పట్టణంలో ఈ ఏడాది వినాయక చవితికి పలువురు పార్టీ గుర్తు, తమ ఫొటోతో బ్యాగుల్లో పెట్టి మట్టి వినాయక విగ్రహాలు ఇంటింటికి పంపిణీ చేశారు. అంతేగాకుండా యువత నాడీ పట్టుకునేందుకు గణేశ్ మండపాల నిర్వాహకులకు వేలాది రూపాయలు ఖర్చు చేసి విగ్రహాల ఇప్పించారు. ప్రస్తుతం దేవి శరన్నవత్రుల సందర్భంగా అమ్మవారి విగ్రహాలు కూడా అందజేసి యువతను తమవైపు తిప్పుకునే పనిలో నిమగ్నమయ్యారు.

### బెడిసి కొడితే అంతే..!

రాష్ట్రప్రభుత్వం ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించి చివరగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఇంకా చాలా సమయం పట్టే అవకాశం కూడా ఉంది. అయినా ఆశావహులు మాత్రం ఖర్చుకు ఏమాత్రం వెనకాడకుండా సంబంధిత వార్డుల్లో తమపని తాము చేసుకుంటూ పోతున్నారు. ఈ క్రమంలో ఖర్చు తడిసి మోపెడు కానుంది. అయినా అభ్యర్థులు సంకోచించడం లేదు. అయితే ఎన్నికల సమయానికి బలాబలల నేపథ్యంలో పార్టీల పరంగా అభ్యర్థులు మారే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటిదాకా ఖర్చు చేసిన అభ్యర్థులకు అప్పటికి టికెట్ వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కొందరు పార్టీల నుంచి ఖచ్చితమైన హామీతో ముందుకు వెళ్తుంటే మరికొందరు అప్పటికి టికెట్ మాదే అనే ధీమాతో ముందుకు సాగుతున్నారు. తీరా ఎన్నిక సమయానికి టికెట్ దక్కకపోతే మొదటికే బెడిసి కొట్టే ప్రమాదం ఉందన్న వాదన వినిపిస్తోంది. ఒక వార్డులో ఒకే పార్టీ నుంచి దాదాపు ముగ్గురు, నలుగురు అభ్యర్థులు గ్రౌండ్ లెవల్‌లో పని చేసుకుంటున్నారు.



## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** నియోజకవర్గ అభివృద్ధికి శాయాశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని శ్రీనగర్ కాలనీలోని 45 డివిజన్‌లో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని డివిజన్‌లోని బాల హనుమాన్ మందిరం పక్కన ఉన్న అండర్ బ్రిడ్జి పాడైపోయినందున కొత్త వంతెన కోసం డీపీఆర్ తయారు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. త్వరలోనే కొత్త వంతెన నిర్మిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కాలనీవాసులు మాట్లాడుతూ.. రాత్రి సమయంలో ఆకతాయిలు 45వ డివిజన్‌లో మద్యం సేవించి న్యూసెన్స్ చేస్తున్నారని వివరించగా.. కట్టికి చర్యలు తీసుకునేలా ఏసీపీతో మాట్లాడతానని చెప్పారు. మున్సిపల్ ఏఈ పావని, లక్ష్మీనారాయణ, ఆకుల శ్రీనివాస్, నరేశ్, బొబ్బిలి వేణు, ఎర్రన్న, పవన్, ఆనంద్ పాల్గొన్నారు.



## ప్రజల సంక్షేమానికి పెద్దపీట

**అక్షరటుడే, బాన్సువాడ :** ప్రజల సంక్షేమమే సర్కారు లక్ష్యమని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మంగళవారం రాష్ట్ర ఆగ్రో ఛైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు సరైన రీతిలో అర్హులకు అందేవిధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలను దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ యామ రాములు, సొసైటీ ఛైర్మన్ ఇంగు రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని శంకర్, సీనియర్ నాయకులు బస్వరాజ్ పటేల్, శశికాంత్, సందీప్, రఘు, కాంత్ రెడ్డి, గంగారాం పాల్గొన్నారు.



## చెరువులుగా మారిన రోడ్లు..

జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. సుమారు అర్ధగంట భారీగా కురిసిన వర్షా నికి నగరంలోని రహదారులన్నీ చెరువులను తలపించాయి. డ్రెయినేజీలు, రోడ్లు ఏకం అయ్యాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షా నికి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్





## తీరు మార్చుకోకుంటే అధికారులపై చర్యలు: ఎంపీ అర్వింద్ ఆగ్రహం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిధులు మంజూరైనప్పటికీ పనులు నత్తనడకన సాగుతుండడపై ఎంపీ అర్వింద్ అగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ దిశ సమీక్ష సమావేశాన్ని ఛైర్మన్ అర్వింద్ అధ్యక్షతన మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎంపీ లాడ్స్ కింద నిధులొచ్చిన పనుల్లో జాప్యంపై అధికారులను నిలదీశారు.

### ఆర్మూర్ డివిజన్లోనే అధికంగా పెండింగ్ పనులు..

జిల్లా వ్యాప్తంగా సగానికి పైగా పనులు పూర్తయినప్పటికీ ఆర్మూర్ డివిజన్ లోనే అధిక శాతం పనులు పెండింగ్‌లో ఉండడంపై ఆర్మూర్ పంచాయతీరాజ్ శాఖ అధికారి రాజేశ్వరిపై ఎంపీ మండిపడ్డారు. ఎంపీ లాడ్స్ కింద చేయిస్తున్న పనులకు స్పష్టంగా నేమ్‌బోర్డ్స్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పథకంలో మూణ్నెళ్ల నుంచి సంబంధిత శాఖలకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి ఎంఆర్ఐ మిషన్ మంజూరైనప్పటికీ ఇంతవరకు ఇక్కడికి చేరుకోకపోవడంతో పేద ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరిగాల్సి వస్తోందని కమిటీ సభ్యులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో ఎమ్మారై మిషన్ ఏర్పాటు చేసేలా అధికారులు చొరవ చూపాలని ఎంపీ సూచించారు.

### జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ..

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద కుటుంబ సభ్యుల్లో మొదటి సంపాదనపరుడు ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల ఆర్థికసాయం అందిస్తోందని ఎంపీ అర్వింద్ అన్నారు. అర్హత ఉన్నవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో అపార్ట్‌మెంట్లు ఇతర వాటికి అధికారులు అడ్డగోలుగా పన్ను వసూలు చేస్తున్నారని దిశ కమిటీ సభ్యులు దృష్టికి తెచ్చారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని నాగారంలోని కెనాల్ క్లీనింగ్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఫారెస్ట్ అధికారి, అదనపు కలెక్టర్లు, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## భక్తితో అమ్మను కొలుస్తూ..

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రెండోరోజు మంగళవారం గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. ఆయా మండపాల వద్ద అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపాలను భక్తులు అందంగా తీర్చిదిద్దుతున్నారు. కోలాటాలు ఆడారు. – అక్షరటుడే, నెట్‌వర్క్


– మిగతా 2వ పేజీలో..



## ‘డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం’

**అక్షరటుడే, కోటగిరి :** డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల నుంచి తాము డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమే అని మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో నెంబర్‌వన్‌గా బాన్సువాడ నియోజకవర్గం నిలిచిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూడా మూడు విడతలుగా బిల్లులు ఇచ్చారన్నారు. డబుల్ బెడ్ రూం బిల్లుల్లో ఎలాంటి అవినీతి జరగలేదని, ప్రభుత్వం నుంచి రూ. 25 కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ బిల్లులు వస్తాయని రాకపోతే ఏఈతో మాట్లాడి బిల్లు వచ్చేవిధంగా చేస్తామని అన్నారు.



## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**అక్షరటుడే, బాన్సువాడ:** కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పనిచేస్తుందని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. వర్ని, రుద్రూర్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేయాలన్నారు. కొత్త-పాత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగితేనే ప్రజల విశ్వాసాన్ని మరింత బలపర్చుకోవచ్చని సూచించారు. ప్రతిగ్రామం కాంగ్రెస్ శక్తిని చాటిచెప్పే విధంగా ప్రజలకు చేరువ కావాలని, పార్టీ పథకాలు, ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ని, రుద్రూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మన్ కీ బాత్ విజయవంతం చేయాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ భీమ్‌గల్ మండల ఇన్‌ఛార్జి నోముల నర్సారెడ్డి కోరారు. మంగళవారం భీమ్‌గల్ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ అధ్యక్షతన పట్టణ, మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 28న మోర్తాడ్ లో ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమం ఉంటుందని, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అలాగే మన్ కీ బాత్ కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి ఆదేశానుసారం బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన కొట్టాల మోహన్, మెండోరా గ్రామానికి చెందిన తక్కురి అంజయ్యలను కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులుగా నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఓరగంటి కిషన్, ప్రధాన కార్యదర్శి బిర్రు రామకృష్ణ, కార్యదర్శి రజినీకాంత్, జి లక్ష్మీనారాయణ, యువ మోర్చా మండల అధ్యక్షుడు శెట్టి ప్రేమ్‌చంద్, తోట రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి దయ్య ప్రవీణ్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు నీలం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, బోధన్ :** చెరువులో దూకి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు సుప్పల సాయిలు కూలీ పనిచేసుకునేవాడు. రెండురోజులుగా అతడు కనిపించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే మంగళవారం ఉదయం గ్రామంలోని చెరువు కట్టపై గంగమ్మ గుడి వద్ద సాయిలుకు చెందిన ఫోన్, చెప్పులు, బండి ఉండడంతో గ్రామస్థులు గమనించగా.. చెరువులో మృతదేహం కనిపించింది. కుటుంబ కలహాలతో సాయిలు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెచ్చిపోయిన దొంగలు..

### 30 తులాల బంగారం చోరీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ నగరంలో దొంగలు రెచ్చిపోయారు. ఓ ఇంట్లోకి చొరబడి 30 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. నగరంలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. నాగారంలోని బ్రాహ్మణ కాలనీకి చెందిన పవన్ శర్మ ఇంటికి తాళం వేసి పూజకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఆయన ఇంట్లో చోరీ జరిగింది. ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. లాకర్‌లో ఉన్న 30 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐదో టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అక్కడ అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సిబ్బందే ఆదుకుంటున్నారు. పురిటి నొప్పులతో బాధ పడుతూ.. అంబులెన్స్ లో ఆస్పత్రికి వచ్చే పలువురు గర్భిణులకు అంబులెన్స్ లోనే ప్రసవం జరుగుతోంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గైనిక్ వైద్యులు అందుబాటులో లేరు. దీనికి తోడు డిప్యుటేషన్‌పై వచ్చిన వైద్యులు ప్రసవాలపై పెద్దగా పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. - అక్షరటుడే, గాంధారి

# అంబులెన్స్ సిబ్బందే ఆదుకుంటున్నారు..!

▸ నెలలో 10 కాన్పులు 108లోనే.. ▸ గాంధారి ఆస్పత్రిలో అందని గైనిక్ సేవలు ▸ గర్భిణులకు తప్పని అవస్థలు

మండలంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చే గర్భిణులకు సరైన సేవలు అందడం లేదు. డెలివరీ కోసం వచ్చే వారికి సేవలు అందించకుండా కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. జూలై నెలలో ఆరు నుంచి ఏడు కేసులు అంబులెన్స్ లోనే ప్రసవం చేశారు. తల్లి బిడ్డను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. దాదాపు నెలలో 10 కాన్పులు అంబులెన్స్ లోనే జరుగుతున్నాయి. ఎందుకంటే పురిటి నొప్పులతో వచ్చే వారు కామారెడ్డి ఆస్పత్రికి తరలించే క్రమంలో అంబులెన్స్ లోనే ప్రసవం అవుతున్నారు.

### డిప్యుటేషన్ పై వచ్చి..

నెల రోజుల నిమిత్తం ఆస్పత్రికి డిప్యుటేషన్ పై వచ్చినవారు మాకెందుకులే రిస్క్ అనుకుంటున్నారు. ఏకంగా అంబులెన్స్ కి ఫోన్ చేసి రిఫర్ చేస్తున్నారని తెలుస్తోంది. ఒకరికి మూడో కాన్పు కూడా రిఫర్ చేశారంటే వారి నిబద్ధత తెలుస్తోంది. దీనికి తోడు గైనిక్ డాక్టర్ అందుబాటులో లేక, అడ్వాన్స్ టెక్నాలజీ లేదనే కారణాలతో రిఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

### గైనిక్ డాక్టర్ అందుబాటులో లేదు..

గాంధారి మండల కేంద్ర ఆస్పత్రిలో గైనిక్ డాక్టర్ అందుబాటులో లేరు. మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో గైనిక్ డాక్టర్ తప్పనిసరి. ఇప్పటికైతే స్టాఫ్ నర్సులతో డిప్యుటేషన్ పై వచ్చిన నర్సులతో వెల్లదీస్తున్నాం. గైనిక్ డాక్టర్ అవసరం ఎంతైనా ఉంది.

- సంగీత్, ఆస్పత్రి ఇన్‌ఛార్జి



## 108 అంబులెన్స్‌లో ప్రసవం


**అక్షరటుడే, గాంధారి :** అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది స్పందించారు. అంబులెన్స్‌లలోనే డెలివరీలు నిర్వహించి తల్లీబిడ్డలను కాపాడారు. గాంధారి మండలం కరక్‌వాడి గ్రామానికి చెందిన మమతకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో మంగళవారం ఉదయం ఆమె భర్త మహేష్ 108 సిబ్బందికి ఫోన్ చేశాడు. వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది రమేశ్, అస్లాం కలిసి మహేష్ ఇంటికి చేరుకుని కామారెడ్డి జీజీహెచ్‌కు తరలిస్తున్న సమయంలో మర్గమధ్యంలో ఆమెకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని నిలిపేసి అంబులెన్స్‌లోనే నార్మల్ డెలివరీ చేశారు. తల్లీబాబు క్షేమంగా ఉన్నారు. అనంతరం 198 ఈఆర్‌సీపీ వైద్యుడు శివ సలహాతో ఆస్పత్రికి తరలించారు. అత్యవసర స్థితిలో స్పందించిన అంబులెన్స్ సిబ్బందికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



**అక్షరటుడే, బాన్సువాడ :** పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముంటున్న సుమలతకు పురిటినొప్పులు ఎక్కువ కాగా.. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చేరింది. లోపల శిశువు మెకోణియం (మలవిసర్జన) చేసినట్లు వైద్యులు గుర్తించి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. స్పందించిన 108 సిబ్బంది అంబులెన్స్‌లో సుమలతను తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఆర్‌సీపీ శివ సూచనల మేరకు అంబులెన్స్ సిబ్బంది రోడ్డు పక్కనే సురక్షితంగా సాధారణ కాన్పు చేశారు. ఈ సందర్భంగా సుమలత మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు క్షేమంగా ఉన్నారు. చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ ప్రసాద్, పైలట్ సుభాష్‌కు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


డిచ్‌పల్లి 7వ పోలీస్ బెటాలియన్ ఆవరణలో..


నగరంలోని భూలక్ష్మి మాత ఆలయంలో..


శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో..


నిజామాబాద్ రేడియో స్టేషన్ వద్ద శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో..


వేల్పూర్ మండల కేంద్రంలో..


ఇందల్వాయి మండలంలో..


లింగంపేట మండలం మెంగారం గ్రామంలో..


వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో యజ్ఞం



## ఎస్సైను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా మహేందర్ బాధ్యతలు స్వీకరించారు. దీంతో మంగళవారం బరంగెడ్గి కాంగ్రెస్ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెంజర్ల అనిల్‌కుమార్, దేవానంద్ దేశాయ్, లక్కపల్లి శ్రీనివాస్, జంగం అశోక్, సాయిలు, లక్కపల్లి బీరుగొండ, ఒక్నర్ అశోక్, బొదనం సాయిలు, జంగం బస్వంత్, లక్కపల్లి మల్లుగొండ, కోటల్ రాము, పీరుగొండ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినయ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, రవి గౌడ్, జిమ్మీ రవి, శ్యాంగౌడ్, శ్రావణ్, తప్పన్న, విజయ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిపై కూలిన రైస్‌మిల్లు గోడ.. తండ్రి కూతురు మృతి

**అక్షరటుడే, కోటగిరి :** ఇంట్లో నిద్రిస్తున్న వారిని గోడ రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శిథిలావస్థలో ఉన్న ఓ రైస్ మిల్లు గోడ కూలి ఇద్దరు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి ఎస్సీ కాలనీలో రేకుల షెడ్డులో మహేష్ కుమార్, అతని భార్య, కూతురితో జీవిస్తున్నాడు. అయితే ఆయన ఇంటి పక్కన శిథిలావస్థకు చేరిన రైస్ మిల్లు ఉంది. సోమవారం రాత్రి భోజనం చేసి కుటుంబ సభ్యులు పడుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున రైస్‌మిల్లు గోడ కూలి మహేష్ కుమార్ ఇంటిపై పడింది. ఈ ఘటనలో మహేష్‌కుమార్, అతని కూతురు మరణించారు. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. శిథిలావస్థలో ఉన్న రైస్ మిల్లును తొలగించాలని యజమానులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోయారు. ఇద్దరి మృతితో కోటగిరిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు.



## ‘లయన్స్’ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

**అక్షరటుడే, బాల్కొండ:** మండలం కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రాజు 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మోతిబిందు సమస్య ఉన్నవారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ చాకులింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కార్యదర్శి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని పలు వార్డుల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. స్థానిక 19 వార్డులో మంగళవారం ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఇందులో అనిషా (3, ) షేక్ కమర్ (2) కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చిన్నారులను బోధన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.